# హుళక్కి!

పచ్చిపులుసు పరాంకుశం గారంటే ఒక్క ఆంధ్ర దేశానికే కాదు యావత్ భారతదేశానికీ తెలుసు!

కాకలు తీరిన కథా రచయిత! నవలాకారుడు! నాటకకర్త... ప్రయోక్త! రంగస్థల నటుడుగా అనేక ప్రయోగాలు చేసిన ఘనాపాటి.

శతాధిక పుస్తకకర్త అయిన ప.ప.గారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనుండి కథ నవలా ప్రక్రియల్లో అకాడెమీ అవార్డు పొందిన మహాశయుడు.

చిన్నతనంలో ప.ప.గారు పలక బలపం పట్టుకుని పట్టుమని పదిరోజులైనా బడికెళ్ళిన దాఖలాలు ఎక్కడా కన్పించవు. విద్యాభ్యాసం చేసి బడికి పంపిన రోజే పలక నేలకేసి కొట్టి బలపాన్ని పొడిచేసి ఉపాధ్యాయుడిని నోటికొచ్చినట్టల్లా తిట్టేడని ప్రతీతి.

చేతిలో వారపత్రిక... పరుగులాంటి నడకతో వచ్చిన పార్వతీశం... పంచపాళిలో గల వాలుకుర్చీలో వున్న ప.ప.గారి పాదాల చెంతకొచ్చి పడ్డాడు. పరుగెత్తుతూ వచ్చాడేమో ఖర్మ... రొప్పుతూ ఆయాస పడుతున్నాడు.

'ఏమిటోయ్ పార్వతీశం... కాస్తంత అలుపు తీర్చుకో!... దాహం పుచ్చుకుంటావా?...' కాళ్ళ దగ్గరున్న పార్వతీశాన్ని రెండు భుజాలు పట్టుకుని లేవనెత్తుతూ అడిగేరు ప.ప.గారు.

'వీక్లీలో ప్రకటన చూశారా?!...' పత్రిక ఉన్న చేతిని పైకెత్తి చూపుతూ బల్లగుద్ది వాదించే వకీలులా మాట్లాడేడు పార్వతీశం.

'ఏదీ... నువ్వు చూపించనిదే...పత్రికలో విషయాన్ని గ్రహించడానికి నా వద్దేమైనా మహిమలున్నాయా ఏమిటీ?...' జవాబిచ్చిన ప.ప.గారు కుర్చీలోంచి పక్కకు తలతిప్పి వంటింటికేసి దృష్టి సారించి శ్రీమతిని ఉద్దేశించి 'రెండు కాఫీలు పంపుతావుటోయ్...' కేకేసినట్టు స్వరం పెంచి మరీ అడిగేరు.

'గురూగారూ... మీ ఎక్స్‌పీరియన్స్‌లో ఎన్నో ఎన్నెన్నో మాస/వార/పక్ష/దిన పత్రికలు చూసి ఉంటారు. లెక్కలేనన్ని కథల పోటీల్లో... నవలల పోటీల్లో పాల్గొని వుంట్టారు. తమరు పొందిన బహుమతులు లెక్కలేవనుకోండి- కానీ ఇలాంటి విడ్డూరం ఎక్కడా ఎప్పుడూ చూచి ఉండరు...' అంటూ తన చేతిలో పత్రిక ప.ప.గారికి అందించాడు పార్వతీశం.

'నీదంతా 'నస'మేళం! విషయాన్ని సూటిగా చెప్పవు కదా?! నువ్వు రాసే కథలూ అట్లాగే ఏడుస్తయ్' శిష్యుడిని శాపనార్థాలు పెడుతూ అందుకున్న పత్రిక తిరగేయటంలో లీనమైనారు.

'నే చెప్పొచ్చిందేమిటంటే... ఫ్యామిలీ కథల పోటీ అని, సరసమైన కథల పోటీఅని, శృంగార కథల పోటీ అని... హాస్య కథల పోటీ అని... నా పిండాకూడు కథలపోటీ అనో అనేకం చూశాం!... వ్రాశాం!!- కానీ... ఏదెవడండీ బాబూ... 'హంళక్కి' పేర త్వరలో ఓ వారపత్రిక ప్రారంభించబోతున్నాడట! అందుకని ఏకంగా 'అమ్మ్యామ్యా' కథల పోటీ పెడుతున్నానంటూ ఈ వీక్లీలో ఫుల్‌పేజీ ప్రకటన ఇచ్చాడు. అది చదివిన నాకు మతి పోయిందనుకోండి.. ప్రథమ బహుమతి లక్షట! ద్వితీయం యాభైవేలు... తృతీయం పాతిక వేలూనట! ప్రైజు మొత్తాన్ని చూస్తుంటే నోరూరిందనుకోండి- మామూలు ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకూ పదివేలిస్తాట్ట!...' లొట్టలేస్తూ చెప్పి వికటంగా కృతకంగా నవ్వేడు పార్వతీశం.

'నీ నవ్వు పాడైపోనూ... ఆపిక! ప్రకటన తాలూకు వివరాలు... నన్నూ చూడనీ...' అంటూ పత్రికలో వెతుకులాట మొదలుపెట్టాడు ప.ప.గారు.

ఇంతలో ఆదెమ్మగారు ఇంట్లోంచి కాఫీగ్లాసులతో చెప్పి ఇద్దరికీ అందించారు.

ఓ చుక్క కాఫీ చప్పరించి పత్రికలో గల 'యాడ్' చదివిన వారై 'ఈ ప్రకటనలో ఇంకో విచిత్రం కూడా వుందోయ్ పార్వతీశం. కథ పంపే ప్రతి రచయితా (త్రి) ఓ వంద రూపాయలు డి.డి. తీసి తప్పనిసరిగా జత చేయాలట!...' కనుబొమలు పెద్దవి చేస్తూ మాట్లాడేడు ప.ప.గారు.

'ఆ కండీషన్ మరీ చోద్యంగా లేదుటండీ. అసలు ఆ కండిషన్ పెట్టడంలో అంతరార్థమేమిటో అర్థమై చావటంలేదు...'

'ఆ! ఏముంది? కలం పట్టుకున్న ప్రతివాడూ ఈ రోజుల్లో కథలు వ్రాసి పారేస్తున్నాడు. పోస్ట్‌వాళ్ళు టపా సంచులు మోయలేక ఇబ్బంది పడుతున్నారు. అంచేత సత్తా సరుకు వున్న కథలు రాబట్టటం కోసమే అయి వుండాలి!'

'అవున్లెండి ఆంధ్రదేశంలో రచయితలకేం కొదవలేదు. ఇంటికోరున్నారు! మీరన్నట్టు క్వాలిటీ వున్న కథలను ఆహ్వానించాలనే ఉద్దేశంతోనేఈ వడపోత ఆలోచనొచ్చి వుండి వుంటుంది. ఆ 'హంళక్కి' పత్రిక సంపాదకుడికి!'

'రచయితలు కథలతోపాటు పంపే ఎంట్రీ ఫీజులతోనే ప్రైజ్‌మనీ మొత్తం వచ్చేట్టు ప్లాన్ చేసినట్టుంది...'

'గురుగారూ! ఏది ఏమైనా మనం కూడా ఈ 'అమ్మ్యామ్యా' కథల పోటీలో పాల్గొని తీరవలసిందే. మన సత్తా మరోసారి నిరూపించుకోవలసిందే. ఏమంటారు?' ప్రైజ్ అప్పుడే వచ్చినట్టు ఫీలైపోతూ ప.ప.గారి ముఖంలోకి చూసేడు పార్వతీశం.

పార్వతీశమంటే పప్పు ధప్పళమేం కాదు. కాకలు తీరిన కథా రచయిత! ఇతను ఏ కథ వ్రాసినా ఆఫీసు స్టేషనరీతోనే... వర్కింగ్ అవర్స్‌లోనే! ఆఫీసులో పని చేసినా చేయకున్నా

అడిగే దిక్కులేదు. అప్పనంగా ఫస్ట్‌కి జీతం వచ్చి జేబులో పడుతుంది. రిటైరయ్యాక ఫించనొచ్చే అవకాశమూ ఉంది.

చాలాసార్లు కథలకు బహుమతులూ కొట్టేశాడు. ఫ్రెండ్స్ ఇతగాడిని 'కథాబలుడు' అని పిలవటం పరిపాటి. మనిషి బలపంలా వున్నా వ్రాసే కథలు బరువుగా బలంగానూ ఉంటయ్.

'అది సరే గురూగారూ.. నాకో చిన్న డౌటు. 'అమ్యామ్యా' కథల పోటీకి ఎలాంటి ఇతివృత్తాన్ని ఎన్నుకోవాలి అని!?...' దిక్కులు చూస్తూ బుర్ర గోక్కున్నాడు.

'శతాధికంగా కథలు వ్రాసిన వాడివి. బోలెడన్నిసార్లు ప్రైజులు లాగించిన ఘనుడివి! నీకిదేం డౌటు? అయినా చెప్తా విను! అవినీతి దురాచారాన్ని రూపుమాపాలంటే ప్రజలు 'అమ్యామ్యా'లు దళారీలకు అధికారులకు ఇవ్వటానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. అందుచేత ఏయే రచయిత కలంనుండి ఎలాంటి సామాజిక ప్రయోజనం గల రచన వెలువడుతోందోని ఇటువంటి కథల పోటీ బహుశా పెట్టి వుంటాడనిపిస్తోంది...'

'అంటే?... అవినీతి వర్ధిల్లాలనా?... అంతమొందాలనా?...' ప్రశ్నలు వర్షం కురిపించాడు పార్వతీశం.

'ఏది నీకూ సమాజానికీ ఆరోగ్యకరమనిపిస్తే... దాన్ని సమర్థిస్తూ కథ ముగించు! దట్సాల్...'

'మీ సూచన టానిక్‌లా పన్చేస్తుంది సార్! ఇంకా ఆలస్యం దేనికి? 'అమ్యామ్యా' కథకి ఈరోజే ఆఫీసుకెళ్ళి శ్రీకారం చుట్టేస్తాను...' గాలిపటంలా ఎగురుకుంటూ ఇంటిదారి పట్టేడు పార్వతీశం.

★★★★★

పరీక్ష వ్రాసిన ప్రతి స్టూడెంటూ తనకు ఫస్ట్ క్లాస్ వస్తుందనుకుంటాడు. లాటరీ టికెట్టు కొన్న ప్రతి వ్యక్తీ తనకే ఫస్ట్‌ప్రైజ్ వస్తుందని ఆశలు పెంచుకుంటాడు.

'హంళక్కి' పత్రిక కథల పోటీ గడువు పూర్తియి రెండు నెలలు గడిచింది.

కథ పోటీకి పంపిన ప్రతి రచయితా (త్రీ) ప్రైజు తనకే వస్తుందని ఎదురుచూపులు చూస్తూండటం సహజం!

ప్రైజు రావచ్చు! రాకపోవచ్చు! మామూలు ప్రచురణకై స్వీకరింపబడవచ్చు! రిజక్ట్ కావచ్చు! అంతా దైవాధీనం.

ఎవరి ఊహాగానాల్లో తీపి ఆలోచనల్లో వారున్నారు. అందరికీ ప్రైజు మనీ మీదే ఆ ఫలితాల కోసం నిరీక్షణ!

ఓ శుభముహూర్తాన చేతిలో ఓ దినపత్రికతో ప.ప.గారి ముందు కొచ్చిపడ్డాడు పార్వతీశం.

"ఏమిటోయ్... ఇంత ఉదయాన్నే వూడిపడ్డావ్?'

"ఏం చెప్పమంటారు?... అన్నీ బాలారిష్టాలే. కాదు కాదు కష్టాలే...' పార్వతీశం కంఠం జీరవోయింది.

'కథల పోటీ ఫలితాలు వచ్చేడ్చినయ్యా? నీకు ప్రైజు మిస్సయిందా?' వేళాకోళంగా మాట్లాడారు ప.ప.గారు.

'మిస్సు కాదు... మిస్సమ్మకాదు గురువర్యా!... రిజల్టూలేదు నా శ్రాద్ధంలేదు. తిన్నాం! అందరం ఖంగు తిన్నాం...' దేబ్యం ముఖం పెట్టాడు. కంట్లో నీరొక్కటే తక్కువ.

'సోది ఆపి... పాయింట్‌కి రావయ్యా మగడా?...' ప.ప.గారిలో అసహనం ధ్వనించింది.

"ఏమని వివరించనూ...' అంటూ సినిమా ట్యూన్ గుర్తొచ్చినవాడిలా మూలిగి 'మనం... అదేనండి రచయితలమంతా పప్పులో కాలేశాం. అందరినీ నమ్మించి వంచించి ఆ హంళక్కి పత్రిక వాడు కుచ్చుటోపీలు పెట్టేడు. వాడు మామూలు మనిషి కాదండీ... మహా మేధావి! రచయితలతోటే క్రికెట్ ఆడేశాడు...' దివాలా ఎత్తినవాడిలా ముఖం పెట్టాడు పార్వతీశం.

పార్వతీశం చేతిలో దినపత్రిక ఛటాలున లాక్కుని పేజీలు తిప్పుతుండగా 'హంళక్కి' పత్రిక వాడి న్యూస్ మేటర్ ప.ప.గారి కళ్ళపడ్డది.

'నిజమని నమ్మి కథతోపాటు డి.డి.లూ పంపి అందరం ఘోరంగా మోసపోయాం గురూగారూ...' లబలబలాడేడు.

పేపర్లో న్యూస్ ఆసాంతం చదవిన ప.ప.గారు భళ్ళున నవ్వి 'హంళక్కి' పత్రిక వాడెవడో గాని సరిక్రొత్త ప్రయోగం చేశాడయ్యా! బోగస్ ప్రకటన ఇచ్చి తలలు గొరిగి డబ్బు దండుకున్నాడు- మోసగాళ్ళకి మోసగాడంటే సరిగ్గా వీడయ్యా! నన్నడిగితే 'అమ్మ్యామ్మ్యా' కథల పోటీకి ఇదే సరైన ముగింపు...' అంటూ కళ్లను తుడుచుకున్నాడు.

- సమాప్తం -

*(ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం 25-2-2007 సంచిక)*